ఈనాడు విజయనగరం

బుధవారం సెప్టెంబరు 25, 2024

2,15,067 జల్‌జీవన్‌లో వేయాల్సిన కుళాయిలు

● నిరంతర తాగునీటి సరఫరాకు కార్యచరణ ● డీపీఆర్ రూపకల్పనకు చర్యలు

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

'అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్నట్లు తయారైంది జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం అమలు తీరు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో ఇంటింటికీ కుళాయిలు వేసి తాగు నీరు అందించాలని నిధులు మంజూరుచేయగా, రాష్ట్రంలో గత ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యం చూపింది. ఫలితంగా పూర్తిస్థాయిలో కనెక్షన్లు వేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక జరిపిన పల్స్ సర్వేలో జిల్లాలో ఇంకా 2,15,067 ఇళ్లకు కుళాయిలు వేయాల్సి ఉన్నట్లు గుర్తించింది. మూడేళ్లలో వేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించింది.

శాశ్వత ప్రణాళికలు..

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. జిల్లాలో బోర్లు, రిజర్వాయర్ల ద్వారా కుళాయి కనెక్షన్లకు నీరందించేలా రూ.36.16 కోట్లతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. బోర్లపై ఆధారపడకుండా సర్ఫేస్ వాటర్ ఇవ్వగలిగే ప్రతిపాదనలు రూపొందించాలన్న ఆదేశాల నేపథ్యంలో ప్రణాళిక మారే అవకాశముంది. జిల్లాలో తాటిపూడి, మడ్డువలస, కుమిలి, ఆంధ్ర రిజర్వాయర్లు ఉన్నాయి. పైప్‌లైన్లు వేసి వీటి ద్వారా నిరంతరం తాగునీరు అందించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. నీటి లభ్యత, వినియోగంపై జలవనరులశాఖ అధికారులతో చర్చించనున్నట్లు గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ ఉమాశంకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

855 పనులు రద్దు

కేంద్రం నిధులిచ్చినా రాష్ట్రంలో గత వైకాపా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఖర్చు చేయకపోవడం, రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో పురోగతిలేని టెండర్లు రద్దు చేయాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణంలో ఉన్నవి గడువులోగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోనుంది. జిల్లాలో 1196 పనులు మంజూరు చేయగా వీటిలో 30 మాత్రమే పూర్తయ్యాయి. టెండర్లు కాని 855 పనులు రద్దయ్యే అవకాశముంది. చేపట్టిన 302 పనులు వేగవంతం చేయనుంది. గత అయిదేళ్లలో గుత్తేదారులకు రూ.16కోట్లు బకాయిలు ఉండడంతో మధ్యలో ఆపేశారు. కొన్ని టెండరు దశలోనే ఉండిపోయాయి. ప్రస్తుతం ఇవన్నీ రద్దయ్యే అవకాశముంది. నాడు-నేడు తరహాలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానాన్ని(సీసీఎస్) తెరపైకి తీసుకొచ్చినా ముందుకెళ్లలేదు. 4.10 లక్షల కుటుంబాల్లో 1.94 లక్షల ఇళ్లకు కుళాయిల కనెక్షన్లు ఇచ్చినా ట్యాప్‌లు అమర్చకపోవడం, నీటి సరఫరా లేకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలినట్లు గుర్తించారు.



సర్వే చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

జిల్లాలో సర్వే తర్వాత కనెక్షన్ల పరిస్థితి ఇలా...	మొత్తం ఆవాస ప్రాంతాలు	కుటుంబాలు	కుళాయి కనెక్షన్లు	ఇంకా అవసరమైనవి
	1621	4,10,065	1,94,998	2,15,067

సిరిమాను చెట్టుకు అఖండ అర్చనలు



డెంకాడ, న్యూస్‌టుడే: పైడితల్లి ఉత్సవాలకు సంబంధించి సిరిమాను చెట్టు పెదతాడివాడలో సాక్షాత్కారమవడంతో మంగళవారం విజయనగరం, పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ నెల 28న సిరిమాను చెట్టును భూదేవి నుంచి వేరు చేసి ఘనంగా ఊరేగిస్తారు. భారీ అన్నదానం నిర్వహణపై గ్రామస్థులు సమావేశమయ్యారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు విలువైనవి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని, వారు ప్రజారోగ్య ప్రదాతలని విజయనగరం నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విజయవాడ వరదల్లో బాధితులకు విశేష సేవలు అందించిన 150 మంది కార్మికులు, సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని మంగళవారం విజయనగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. విపత్తు వేళ వెంటనే స్పందించి, విజయవాడ వెళ్లారని.. 10 రోజుల పాటు అక్కడ పనిచేశారని గుర్తు చేశారు. వారి ఆరోగ్యం కోసం విరివిగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. డిప్యూటీ మేయరు శ్రావణి, కమిషనర్ నల్లనయ్య, ఈఈ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి, ఏసీపీ అమ్మాజీరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కార్మికులతో మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, ఇతర అధికారులు

13 వేదికలపై విజయనగరం ఉత్సవాలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలను ఈ ఏడాది 13 వేదికలపై నిర్వహించనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఉత్సవ నిర్వహణ కమిటీ, జీవితకాల సభ్యులతో ఏర్పాట్లపై చర్చించారు. నాలుగు రోజుల్లో కార్యక్రమాలను ఖరారు చేయాలన్నారు. అక్టోబరు 13న 15 వేల మందితో ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. 13, 14వ తేదీల్లో అయోధ్య మైదానంలో మెగా ఈవెంట్ పేరుతో పలు కార్యక్రమాలు, పెంపుడు జంతువుల ప్రదర్శన ఉంటాయన్నారు. మహారాజా సంగీత నృత్య కళాశాలలో పండ్లు, పూలు, కోటలో వైజ్ఞానిక, గురజాడ కళాభారతిలో నాటక ప్రదర్శనలు, విజ్జీ స్టేడియంలో క్రీడా పోటీలు, రాజీవ్ స్టేడియంలో హెలీకాప్టర్ రైడ్, ఆనందగజపతి కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బొంకుల దిబ్బ వద్ద సురభి నాటకాలు, కోట ముందు పులివేషాలు ఉంటాయన్నారు. మాన్సాస్ మైదానంలో సారస్ ఎగ్జిబిషన్ పెట్టాలన్నారు. లయన్స్‌క్లబ్‌లో జానపద కళలు, ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో కవి సమ్మేళనాలు, ఆధ్యాత్మిక కచేరీలు నిర్వహించాలని చెప్పారు. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్, డీఆర్వో ఎస్‌డీ.అనిత, ఆర్డీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

పారిశ్రామికవాడ ప్రక్షాళనకు అడుగులు

ఔత్సాహికులకు మరో అవకాశం

పారిశ్రామికవాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు వందల ఎకరాలు దక్కించుకున్న వారంతా ఏళ్లు గడుస్తున్నా ముందుకు రావడం లేదు. అలాంటి వాటిని గుర్తించి రద్దు చేయాలని ఏపీఐఐసీ అధికారులు ఇటీవల నిర్ణయం తీసుకోవడంతో ఇక కదలిక రాబోతోంది. న్యాయపరమైన చిక్కుల్లో ఉన్న వాటిని గుర్తించి పరిష్కార దిశగా ఆలోచన చేస్తున్నారు. స్థలాలు వెనక్కి తీసుకునే విధానాన్ని అమలు చేస్తే కొత్త ఔత్సాహికులకు కేటాయించే అవకాశం ఉంది. ఈ విధానాలతో వాడకు కళ రాబోతోంది. – న్యూస్‌టుడే, బొబ్బిలి



స్టీల్ ఇండియాకు కేటాయించిన స్థలం

ఏళ్లుగా జాప్యం

★ పారిశ్రామికవాడలో పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు వందల ఎకరాలు కేటాయించారు. పదేళ్లు అవుతున్నా అతీగతీ లేదు. తాజాగా తీసుకున్న నిర్ణయంతో కదలిక రావాల్సిన అవసరం ఏర్పడింది.

★ కేంద్ర ప్రభుత్వ సహకారంతో మాంగనీస్ ఓర్ ఇండియా(మోయిల్) సంస్థ సుమారు రూ.500 కోట్లతో మినీ స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు పదేళ్ల కిందట ముందుకు వచ్చింది. బొబ్బిలి వాడలో 110 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.

★ స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియాకు సుమారు 70 ఎకరాలు కేటాయించారు. ఆ సంస్థ యూనిట్లు ఏర్పాటు చేయలేదు.

★ రసాయన, బయో కెమికల్ కర్మాగారాలకు మరో 100 ఎకరాలు కేటాయించినా ఏర్పాటు చేయలేదు.

★ బీకే స్టీల్ యాజమాన్యం రూ.వెయ్యి కోట్లతో చిన్న ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పదేళ్ల కిందట ముందుకు వచ్చింది. ఏపీఐఐసీ 300 ఎకరాలు కేటాయించింది. పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఇందులో 150 ఎకరాలు సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు కేటాయించారు. ఎవరూ ముందుకు రాలేదు.

★ ఏడాది క్రితం జిందాల్ యాజమాన్యం రూ.100 కోట్ల అంచనా వ్యయంతో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లే వచ్చి వెనక్కి వెళ్లింది. స్థలం ఇచ్చేందుకు ఏపీఐఐసీ ముందుకు వచ్చినా.. మౌనం దాల్చింది.

★ ఏపీఐఐసీ తాజా నిర్ణయంతో యూనిట్ల రాకకు మోక్షం కలుగుతుందని నిపుణులు భావిస్తున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

కొంతమంది స్థలాలు తీసుకున్నా పరిశ్రమలు పెట్టలేదు. వాటిని గుర్తించాం. వెనక్కి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఖాళీ స్థలాల్ని కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయిస్తాం. సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నాం.

– మురళీ మోహన్, జోనల్ ప్రబంధకుడు, ఏపీఐఐసీ

బొబ్బిలి పారిశ్రామికవాడలో యూనిట్ల పురోగతి	★ వాడలో ఏర్పాటు కావాల్సిన యూనిట్ల సంఖ్య	★ వాటికి కేటాయించిన స్థలం	★ ప్రస్తుతం ఉన్న యూనిట్ల సంఖ్య	★ వాటిలో పనిచేస్తున్నవి	★ మూతపడ్డ యూనిట్లు	★ పారిశ్రామికవాడలో ఉపాధి లక్ష్యం	★ ప్రస్తుతం పొందుతున్న వారు
	520	881.96 ఎకరాలు	302	121	82	9 వేల మందికి	400 మాత్రమే

3 రోజుల పాటు వర్షాలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో వచ్చే మూడు రోజుల్లో వర్ష సూచనలు ఉన్నందున అధికారులు తమ మండలాల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. అమరావతి వాతావరణ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు బుధ, గురువారాల్లో ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపారు. అన్ని మండలాల్లో కంట్రోల్‌రూంలు తెరవాలని సూచించారు. చెరువులు, వాగులు, గెడ్డలు, కుంటలు నిండి ఉన్నందున ప్రజలు వాటిని దాటే ప్రయత్నం చేయకుండా భద్రత ఏర్పాటు చేయాలన్నారు.

విధేయతకు వీరతాడు



మార్క్‌ఫెడ్ ఛైర్మన్‌గా నియమితులైన బంగార్రాజుకు లడ్డూ తినిపిస్తున్న ఎంపీ కలిశెట్టి

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే భోగాపురం, చీపురుపల్లి: పార్టీలపై విధేయత చూపి, ఎన్నికల్లో చిత్తశుద్ధితో పనిచేసిన నాయకులకు కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులిచ్చి గుర్తించింది. మంగళవారం విడుదలైన తొలిజాబితాలో ఉమ్మడి జిల్లా నేతలు ఉన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త కర్రోతు బంగార్రాజుకు రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్, పార్వతీపురం మన్యం జిల్లా పెదబుడ్డిడికి చెందిన తమ్మిరెడ్డి శివశంకర్‌కు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు దక్కాయి. గత ఎన్నికల్లో నెల్లిమర్ల టికెట్టు ఆశించగా, పొత్తులో భాగంగా జనసేనకు ఆ స్థానం కేటాయించారు. ఆయన త్యాగాన్ని అధిష్ఠానం గుర్తించింది. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతిరాజును బంగార్రాజు బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శివశంకర్ స్వయం కృషితో ఎదిగి వాణిజ్యపన్నుల శాఖలో సంయుక్త కమిషనర్‌గా పనిచేశారు. అయిదేళ్ల కిందట స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి జనసేన పార్టీలో చేరారు. విశాఖలో స్థిరపడిన ఆయన పెందుర్తి టికెట్టు ఆశించారు. సీట్ల సర్దుబాటులో దక్కకపోయినా పార్టీ విజయానికి కృషి చేశారు.



గద్దె బాబూరావు

మరికొందరికి..: చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భాంజ్‌దేవ్‌ను సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. పర్యాటకాభివృద్ధి సంస్థ సభ్యురాలిగా ఎస్.కోట ఎంపీటీసీ సభ్యురాలు ఇందుకూరి సుబ్బలక్ష్మిని నియమించారు. గత ఎన్నికల ముందు తెదేపాలో చేరారు. ఏపీ ట్రైకార్ సంస్థ సభ్యురాలిగా కురుపాం నియోజకవర్గానికి చెందిన పువ్వల లావణ్యను నియమించారు.



27న రామతీర్థంలో పవిత్రోత్సవాలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో ఈనెల 27వ తేదీ నుంచి 30 వరకు స్వామివారికి పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఈవో వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 27న ఉదయం 6 గంటలకు పుణ్యాహవచనం, అంకురారోహణ చేపడతారు. 28న యాగశాలలో హోమాలు, పవిత్ర శుద్ధి నిర్వహిస్తారు. 29న అష్టకలశ స్నపన మహోత్సవం, 30న పవిత్ర నిమజ్జనం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, శ్రీరామచంద్ర స్వామికి పట్టాభిషేక మహోత్సవం జరిపిస్తారు. భక్తులంతా స్వామివారి పూజలకు హాజరు కావాలని ఈవో కోరారు.



రాజాం- పాలకొండ మార్గంలోని పెట్రోలు బంకు సమీపంలో గుంతలమయంగా రహదారి

అమ్మో.. రాజాం రోడ్డా!!

రహదారుల పేరు చెబితే రాజాం ప్రజలు వణికి పోతున్నారు. పట్టణంలో విస్తరణ పనులు కొలిక్కి రాకపోవడంతో నరకాన్ని చూస్తున్నారు. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రాజాం- పాలకొండ రహదారి పూర్తిగా ఛిద్రమైంది. అంబేడ్కర్ కూడలి నుంచి జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకూ దాదాపు రెండు కిలో మీటర్ల మేర ఏర్పడిన గుంతలతో బెంబేలెత్తిపోతున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో రాకపోకలకు వెనకడుగు వేస్తున్నారు. ఈ మార్గంతో పాటు బొబ్బిలి కూడలి నుంచి గాయత్రి కాలనీ వరకు విస్తరణకు గత ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లు మంజూరైనా, నిధులు విడుదల కాలేదు. రూ.6 కోట్ల మేర పనులు చేసి గుత్తేదారు బిల్లులు అందక మధ్యలోనే వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు విడుదల చేసింది. గుత్తేదారు ప్రారంభించాల్సి ఉంది. జాప్యం జరుగుతుండడం, ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా మార్గాలు మరింత దారుణంగా తయారయ్యాయి. పెట్రోలు బంకు సమీపంలో మంగళవారం భారీ లారీ కూరుకుపోయింది. మరో మినీ వ్యాన్, ఇంకొన్ని వాహనాలకూ ఇదే పరిస్థితి ఎదురైంది. పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని జేఈ నాగభూషణరావు తెలిపారు. - న్యూస్‌టుడే, రాజాం


గుంతల్లో కూరుకుపోయిన లారీ

ఎంత కావాలంటే.. అంత రుణం

- పొదుపు సంఘాలకు ప్రభుత్వం భరోసా
- యూనిట్ ఆధారంగా మంజూరు

- న్యూస్‌టుడే, మయూరికూడలి


స్వయం సహాయక సంఘ సభ్యుల సమావేశం

బ్యాంకు లింకేజీ రుణాలు పొందాలంటే గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాల సభ్యులు అష్టకష్టాలు పడేవారు. బ్యాంకుల సైతం నానా నిబంధనలు పెట్టేవి. దీంతో అందుకోలేకపోయేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంఘాల ఆర్థిక పురోగతిపై దృష్టిసారించింది. యూనిట్ల ఏర్పాటుకు రూ.3 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలిస్తోంది. గతంలో రూ.3 లక్షల వరకు మాత్రమే వడ్డీ రాయితీ ఉండేది. తాజాగా రూ.10 లక్షల వరకు వడ్డీ లేకుండా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. అవసరం మేరకు ఇంకా అదనంగా మంజూరు చేయనున్నారు. దీనిపై త్వరలో విధివిధానాలు వెలువడనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

యూనిట్ ఆధారంగా..

ప్రస్తుతం బ్యాంకు లింకేజీ ద్వారా సంఘానికి రూ.25 లక్షల వరకు ఇస్తున్నారు. ఆదాయమొచ్చే యూనిట్లు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఇతర పరికరాల కొనుగోళ్ల కోసం ఈ రుణం తీసుకోవచ్చు. బ్యాంకుల వారీగా 9 నుంచి 12 శాతం వరకు వడ్డీ ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 62,542 సంఘాలుండగా ఈ ఏడాది 32,960కు రూ.1,456 కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో 11,245 సంఘాలకు రూ.156 కోట్లు అందించారు.

సీసీఎల్ పద్ధతిలో

రుణాలను సీసీఎల్(క్యాష్ క్రెడిట్ లోన్) పేరిట మంజూరు చేస్తున్నారు. తీసుకున్న సొమ్ములో 65 శాతానికి పైగా తిరిగి చెల్లిస్తే కొత్తగా మరోసారి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా జీవనోపాధులు మెరుగుపర్చుకోవచ్చు.

అవకాశం ఉంది..

కొన్నేళ్లుగా రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం. యూనిట్ ఆధారంగా మంజూరు చేస్తున్నాం. వడ్డీతో రూ.25 లక్షల వరకు తీసుకోవచ్చు. సంఘంతో పాటు వ్యక్తిగతంగానూ పొందవచ్చు. ప్రభుత్వం ఇటీవల రూ.10 లక్షల వరకు వడ్డీ లేకుండా ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈమేరకు సమాచారం వస్తుంది. ఈ విధానం అమలైతే ఎక్కువ మందికి లబ్ధి చేకూరుతుంది. నర్సరీలు, పౌల్ట్రీలు, తదితర రాలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. - కల్యాణ్ చక్రవర్తి, డీఆర్డీఏ పీడీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబం


నవీన్ (పాతచిత్రం)

గరివిడి, న్యూస్‌టుడే: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబంపై విధి పగబట్టింది. రెండేళ్ల క్రితం తండ్రిని.. ఇప్పుడు కుమారుణ్ని పొట్టన పెట్టుకుని దిక్కులేనివారిని చేసింది. ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన గరివిడి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆర్.నవీన్(31) సరుకుల కోసం మోటారు సైకిల్‌పై మంగళవారం గరివిడి వస్తుండగా.. ఆదర్శ డిగ్రీ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమవగా.. చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆళ్లచికిత్సకై ప్రాణాలు విడిచాడు. తండ్రి వరప్రసాదరావు అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కులా ఉన్నాడు. కూలి పనులు చేస్తూ తల్లి, ఇద్దరు చెల్లెళ్లను పోషిస్తున్నాడు. పెద్ద చెల్లికి వివాహమైంది. మరో సోదరి బృంద, తల్లి కస్తూరి నవీన్‌పైనే ఆధారపడి బతుకుతున్నారు. ఈ ఘటనతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అంకిత

పెళ్లి సందడిలో మేనల్లుడి చేతివాటం

16 తులాల నగలు, రూ.50 వేల అపహరణ

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, పురపాలిక, న్యూస్‌టుడే: పెళ్లి చూపుల కార్యక్రమంలో తోడుగా ఉంటానని పిలిస్తే చేతివాటం ప్రదర్శించి అత్త కుటుంబాన్నే బురిడీ కొట్టించాడు ఓ మేనల్లుడు. ఇంట్లో భద్రపరిచిన 16.72 తులాల బంగారం, రూ.50 వేలు నగదు నొక్కేశాడు. సంబంధిత వివరాలను పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకితా సురానా మంగళవారం వెల్లడించారు. పార్వతీపురం మండలంలోని పెద బొండపల్లికి చెందిన కండి మణెమ్మ రేషన్ డీలరు. ఈమె కుమార్తెకు జులైలో పెళ్లి చూపులు జరిగాయి. తోడు కోసం రామభద్రపురం మండలంలో ఉంటున్న మేనల్లుడు డి.లక్ష్మణరావును పిలిచారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో నగలు, నగదు తీసుకుని లక్ష్మణరావు తిరిగి వెళ్లిపోయాడు. తర్వాత రోజు నగలు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి మేనల్లుడిపై మణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు, ఎస్ఐ దినకర్, పోలీసుల బృందం ఆయన గురించి ఆరా తీశారు. రాజమహేంద్రవరంలోనూ అతనిపై మూడు కేసులు ఉన్నట్లు తెలిసింది. మంగళవారం పెదబొండపల్లి వస్తున్నట్లు సమాచారం రావడంతో నర్సిపురం వద్ద కాపుకాసి లక్ష్మణరావును పట్టుకున్నారు. విచారణ చేపట్టగా తప్పును అంగీకరించాడు. నగదు ఖర్చు చేశానని, 16.72 తులాల బంగారం తిరిగి అప్పగించాడు. ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐతో పాటు హెచ్‌సీ గౌరీశంకర్, సిబ్బంది శివ, కిశోర్, బాషా, నారాయణ, రామకృష్ణ, గోపాల్‌ను ఏఎస్పీ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న నగలు

నేలబావిలో పడి వ్యక్తి మృత్యువాత

రేగిడి, న్యూస్‌టుడే: నేలబావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన రేగిడి మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జొండబందరకు చెందిన బి.తాతబాబు(45) వీరఘట్టం మండలం రేగులపాడులోని తన అత్తవారింటి వద్ద ఉంటున్నాడు. అప్పుడప్పుడూ స్వగ్రామంలోని పొలాలను చూడటానికి వస్తుంటాడు. ఈనెల 19న గ్రామానికి వచ్చి.. పొలంలోని బావిలో కాళ్లు కడుక్కునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నేలబావిలో పడి మృతిచెందాడు. అయితే స్వగ్రామంలో ఉన్నాడని భార్య.. అత్తవారింటికి వెళ్లిపోయాడనుకొని బంధువులు అనుకున్నారు. మంగళవారం అటుగా వెళ్లిన వారికి బావిలో మృతదేహం కనిపించింది. అతని భార్య గీతకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలావతి తెలిపారు.

లారీ- మినీ బస్సు ఢీ

ఐదుగురికి తీవ్ర గాయాలు

గజపతినగరం, న్యూస్‌టుడే: లారీ, మినీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై లక్ష్మణరావు వివరాల మేరకు.. గజపతినగరం మండలం మరుపల్లి శివాలయం సమీపంలో మంగళవారం జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న లారీ, ప్రైవేటు మినీ బస్సు ఢీకొన్నాయి. ప్రమాదంలో విజయనగరానికి చెందిన కె.రేవంత్, కె.సతీష్, పి.అచ్యుతరావు, జి.శేషాచలం, బి.శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో మహారాజా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నుజ్జయిన వ్యాను ముందు భాగం

యువకుల మధ్య ఘర్షణ

పోలీసులకు గాయాలు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రెండు వీధుల యువకుల మధ్య ఘర్షణతో నలుగురు పోలీసులు గాయపడిన సంఘటన సాలూరు పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ అప్పలనాయుడు వివరాల ప్రకారం.. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఈనెల 7న వడ్డివీధి, గొల్లవీధి యువకుల మధ్య గొడవ జరిగింది. ఇరువర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గణేశుడి నిమజ్జనం అయ్యేవరకూ రెండు పూటలా స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని నిబంధన విధించారు. అయినప్పటికీ సోమవారం రాత్రి మద్యంకు దిగారు. ఈ నేపథ్యంలో అడ్డుకునేందుకు పోలీసులు రంగంలో దిగారు. ఆ సమయంలో యువకుల రాళ్లు రువ్వడంతో హెచ్‌సీ సత్యనారాయణతో సహా నలుగురు సిబ్బంది గాయపడ్డారు. 40 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

9 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

మెంటాడ, న్యూస్‌టుడే: మెంటాడ మండలంలో అక్రమంగా తొమ్మిది టన్నుల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని ఆంధ్ర పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై సీతారాం వివరాల ప్రకారం.. ఇద్దనవలస నుంచి ఒడిశాకు బియ్యం తరలిపోతున్నట్లు స్పెషల్ బ్రాంచి పోలీసులకు ముందుస్తు సమాచారం అందింది. దీంతో వాహనాలు తనిఖీ చేపట్టిన పోలీసులు 250 బస్తాల్లో సరకు తరలిస్తున్న వ్యానును గుర్తించారు. వాహన చోదకుడు, బియ్యం యజమానిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం సరకును పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.


స్వాధీనం చేసుకున్న సరకుతో ఎస్సై

మాటలు కలిపాడు.. నగదు కొట్టేశాడు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: సాయం చేస్తానని మాయమాటలు చెప్పిన ఓ కేటుగాడు నగదుతో పరారైన ఘటన నగరంలో జరిగింది. సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. పూసపాటిరేగ మండలం కొవ్వాడకు చెందిన ఎల్.లక్ష్మణరావు తన కుటుంబ సభ్యుల ఎల్ఐసీ పాలసీ సొమ్ము కట్టేందుకు రూ.50 వేలతో వారం రోజుల కిందట జిల్లా కేంద్రానికి వచ్చారు. కార్యాలయానికి వెళ్లగా.. సర్వర్ సమస్యతో ఆలస్యమైంది. ఈలోపు లీలా మహల్ సమీపంలో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లారు. అక్కడ నగదు తీసి లెక్కపెడుతుండగా శ్రీకాకుళం జిల్లా ఎస్సై ర్రకు చెందిన బి.కనకరాజు గమనించాడు. మద్యం తాగుతున్న లక్ష్మణరావు వద్దకు వెళ్లి మాటలు కలిపాడు. తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని కొంత దూరం తీసుకెళ్లాడు. ఎవరూ లేని ప్రదేశంలో ఆపి బెదిరించి, నగదుతో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ధర్మపురి రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డాడు. అనుమానంతో విచారించగా.. అసలు నిజం ఒప్పుకొన్నాడు. నిందితుణ్ని అదుపులోకి తీసుకుని, రూ.38,500 నగదు, పలు పత్రాలు, స్కూటీని స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామని సీఐ చెప్పారు.



తగ్గని నాగావళి వరద ఉద్ధృతి

ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. జిల్లాతో పాటు ఒడిశా ప్రాంతంలో వర్షాలు కురవడంతో మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల ద్వారా నదిలోకి నీటిని విడిచిపెట్టారు. దీంతో ప్రవాహం ఉద్ధృతంగా సాగుతోంది. మరోవైపు నదీ తీరం వెంబడి ఉన్న ఎత్తిపోతల పథకాలకు పుష్కలంగా సాగునీరు అందుతోందని, సాగుకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని అధికారులు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, పాలకొండ

పుర ఇంజినీర్లపై విచారణకు ఆదేశం

పార్వతీపురం, పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం పురపాలక సంఘంలో వివిధ సమయాల్లో ఇంజినీరింగ్ విభాగంలో డీఈఈలు, ఏఈలుగా పనిచేసిన నలుగురు ఉద్యోగులపై విజిలెన్సు దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.కె.సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురంలో పనిచేసిన డీఈఈలు డి.శ్రీరామ్మూర్తి, వి.జగన్మోహన్, ఏఈలు జి.ఆనంద్, ఎ.నరసింహమూర్తిపై దర్యాప్తు చేపట్టే బాధ్యతను విజిలెన్సు విభాగానికి అప్పగించారు. దర్యాప్తునకు సంబంధించిన నిబంధనలు మాత్రం ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. గతంలో వీరిపై కొందరు ఫిర్యాదు చేయగా.. నోటీసులు పంపించిన అధికారులు వివరణ ఇవ్వలేదు. దీంతో విజిలెన్సు ఉత్తర్వులు వచ్చినట్లు కొందరు అభిప్రాయపడుతున్నారు. వీరిలో డి.శ్రీరామ్మూర్తి ఉద్యోగ విరమణ కూడా చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్స్‌లెస్)	బ్రెస్ట్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

భారీగా బదిలీలు

విజయనగరం అర్బన్, కొత్తవలస, న్యూస్‌టుడే: రెవెన్యూ విభాగంలో 462 మందిని బదిలీ చేసినట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. వారిలో తహసీల్దార్లు- 1, ఉప తహసీల్దార్లు- 69, సీనియర్ సహాయకులు- 50, జూనియర్ సహాయకులు- 21, వీఆర్వో (గ్రేడ్-1)- 238, వీఆర్వో (గ్రేడ్-2)- 81, రికార్డు అసిస్టెంట్- 01, సబార్డినేట్- 01 ఉన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో 13 మంది ఈవోపీఆర్డీలకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ అంబేడ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.
- మండల, డివిజన్ ఇంజినీర్లు కలిపి 37 మందికి స్థానాలు మారాయి. ఇద్దరు కార్యనిర్వాహక ఇంజినీర్ల బదిలీ అయినట్లు పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాసరావు తెలిపారు.
- మాన్సాస్ కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, సీనియర్ సహాయకుడు, జూనియర్ సహాయకులకు బదిలీలయ్యాయి.

విజయనగరం పట్టణం: నగరపాలక సంస్థ డీఈఈలు ఎస్.అప్పారావు, బి.రామసుబ్బారావు, ఎల్ఏసీస్ కుమార్ జీవీఎంసీకి వెళ్లనున్నారు. వారి స్థానాల్లో పీవీఎస్ వీవీ ప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, టి.మణికుమార్ వస్తున్నారు. ఏఈలు ఎన్.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ జీవీఎంసీకి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి ఎస్.రవికుమార్, సీహెచ్.పార్వతి వస్తున్నారు.

ఈపీడీసీఎల్‌లో ఈఈలకు..

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ విజయనగరం పట్టణ డివిజన్ ఆపరేషన్ సర్కిల్ ఈఈ పి.హరిని కన్‌స్ట్రక్షన్ ఈఈగా నియమించారు. ఆయన స్థానంలో పి.త్రినాథరావును నియమించారు. టెక్నికల్ ఈఈ ఎం.ధర్మరాజును విశాఖపట్నం సర్కిల్ కార్యాలయానికి పంపించారు. ఆయన స్థానంలోకి పి.మురళీకృష్ణ వస్తున్నారు.

డీఎంగా శ్రీనివాసరావు

పార్వతీపురం: మన్యం జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా ప్రబంధకునిగా పి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చారు. గతంలో పనిచేసిన దేవుళ్లనాయక్ బదిలీపై వెళ్లారు.

ఈఈగా కుమార్

గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరుగా కేవీఎస్ఎన్.కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక గుత్తేదారుకు అదనపు చెల్లింపులు చేయడంతో ఈఈ శాంతీశ్వరరావుపై ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

మన్యానికి కొత్త ఎస్ఈ

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లాకు ఈపీడీసీఎల్ కొత్త ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా కె.చలపతిరావును నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కార్పొరేట్ ఆఫీసులో జనరల్ మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆపత్కాలంలో దాతల అండ

బొబ్బిలి, బాడంగి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన పలువురు మంగళవారం ఎమ్మెల్యే బేబీనాయనకు విరాళాలు అందించారు. బొబ్బిలి మండలం నారాయణప్పవలస, కాశిందొరవలస తెదేపా నాయకులు, ప్రజలు రూ.37 వేలు, డి.గదబవలస నాయకులు జె.రమేష్‌నాయుడు తదితరులు రూ.25 వేలు, బొబ్బిలి పట్టణ భాజపా నాయకులు బి.రవికిషోర్ రూ.20,079, అలజంగి గ్రామ యువత రూ.10వేలు, గొల్లాది గ్రామానికి చెందిన ఎన్.గురునాయుడు, పి.వెంకటరావు రూ.10వేలు అందించారు. రామభద్రపురం కొట్టక్కి గ్రామానికి చెందిన ఎల్.పైడిరాజు రూ.5 వేలు, ఎం.నీలం మాని రూ.5 వేలు, ఆర్.గోవిందరావు సోదరులు రూ.2,516, కొండవెలగాడ బి.బంగారునాయుడు, సుభద్ర రూ.2 వేలు, తెర్లాం మండలం రాజయ్యపేట సర్పంచి ఎం.లక్ష్మీ, జి.మురళీకృష్ణ, ఆర్.సూర్యనారాయణ రూ.16 వేలు, అంట్లవార గ్రామస్థులు రూ.15 వేలు బేబీనాయనకు అందజేశారు.

పార్వతీపురం గ్రామీణం, పురపాలిక: పార్వతీపురానికి చెందిన రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు, దుస్తుల షాపు యజమాని బి.రామకృష్ణ రూ.40 వేలు విలువైన వస్త్రాలను ఎమ్మెల్యే బి.విజయచంద్రకు అందజేశారు.

సీతానగరం: మండలంలోని కృషి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం రూ.40 వేలతో ఫ్లైలు, పాఠశాల విద్యార్థులు సీపురం పరిధిలోని ఉర్లేటనగర్‌లో 160 మంది బాధితులకు దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. కృష్ణ రాయుడుపేట సర్పంచి జి.అన్నంనాయుడు రూ.10 వేల నగదును ఎమ్మెల్యే విజయచంద్రకు అందజేశారు.

పార్వతీపురం పురపాలక: పార్వతీపురానికి చెందిన ప్రజావేదిక వాట్సాప్ గ్రూప్ సభ్యులు ముందుకు వచ్చారు. అందరి నుంచి సేకరించిన రూ.41,016 మొత్తాన్ని ఎమ్మెల్యే విజయచంద్రకు అందజేశారు.

విద్యావిభాగం: నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తరఫున ఉపాధ్యాయులు రూ.10 వేల విరాళాన్ని కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు.

మయూరి కూడలి: బాధితులకు రూ.75 వేలు అందజేయనున్నట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం తెలిపింది.


ఎమ్మెల్యే బేబీనాయనకు నగదు అందిస్తున్న నారాయణప్పవలస, కాశిందొరవలస వాసులు


విజయచంద్రకు నగదు అందజేస్తున్న సభ్యులు


కలెక్టర్‌కు చెక్కు ఇస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

మూడు నియోజకవర్గాల్లో ఇసుక కొరత


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల్లో ఇసుక కొరతతో నిర్మాణ రంగం దెబ్బతింటోందని ఎమ్మెల్యే బి.జగదీశ్వరి అన్నారు. ఇసుక సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను కోరారు. భామిని మండలంలోని వంశధార తీరంలో రేవు కేటాయించడంతో కొన్ని మండలాలకే ఇసుక చేరుతుందన్నారు. నాగావళి నదీ తీరంలోనూ రేవులు కేటాయించాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, వీరఘట్టం, కొమరాడ, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల ప్రజలకు ఇసుక కొరత తీవ్రంగా ఉందన్నారు. తెదేపా నాయకులు శేఖర్‌పాత్రుడు, పి.రాంబాబు, డి.రామకృష్ణ, ఎన్.కృష్ణబాబు, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



చంపావతి

పురిటిపెంట పంచాయతీలో సేకరించిన చెత్తను వేసేందుకు డంపింగ్ యార్డు లేదు. దీంతో రైల్వే వంతెన వద్ద చంపావతి నదిలో ట్రాక్టర్లు దిగేందుకు వీలుగా ఉండటంతో అక్కడ పడేస్తున్నారు. ఇటీవల స్థానికుల మంత్రి కె.శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన పరిశీలించారు. చెత్త వేయొద్దని చెప్పడంతో పంచాయతీ సిబ్బంది మిన్నకున్నా.. స్థానికులు, దుకాణదారులు కొంచెం కొంచెం వేస్తున్నారు. పంచాయతీ చెత్త వేసేందుకు స్థలాన్ని కేటాయించాలని మంత్రి తహసీల్దారుకు గతంలో సూచించారు. చెత్తను వేయకుండా చేస్తామని గ్రామ కార్యదర్శి తిరుపతి తెలిపారు. - న్యూస్‌టుడే, గజపతినగరం

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

సురక్షిత తాగునీటితో ఆరోగ్యం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతను పాటిస్తూ సురక్షితమైన నీరు తాగితే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్ అన్నారు. పెంటశ్రీరాంపురంలో నిర్వహించిన స్వచ్ఛత సేవా కార్యక్రమంలో మాట్లాడారు. తాగునీటి పథకాలను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రపరుచుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో పైపులైన్లను పరిశీలించారు. ఎస్ఈఈ కవిత, డీఈ గోవిందరావు, జేఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ ఉమాశంకర్

బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలి

మెంటాడ, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. జక్కువలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రపంచమంతా కలియుగ వైకుంఠంగా భావించే తిరుమల తిరుపతిని.. గత వైకాపా ప్రభుత్వం అపవిత్రం చేసిందని ఆరోపించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

? పట్టణంలోని మల్లమ్మ చెరువు గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయాయి. నరసింహుల నాయుడు కాలనీ సమీపంలో గెడ్డలో చెత్త నిల్వ ఉండడంతో వరదనీరు వెళ్లే మార్గం మూసుకుపోయింది. - స్థానికులు
● ప్రజలకు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, రాజాం

? సుందరాడ ప్రాథమికోన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, చెత్త చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పురుగులు, పాములు సంచరిస్తున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు
● సమస్యను సర్పంచి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాను. - మహేశ్, కార్యదర్శి – న్యూస్‌టుడే, తెర్లాం

? మండలంలో కురిసిన వర్షానికి పెణసాం రహదారిపై అడ్డంగా చెట్లు కూలి పడింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు
● తక్షణమే పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం. - ఏఈ నందకుమార్ – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? విజయనగరం- పాలకొండ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. - స్థానికులు
● ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే పనులు చేస్తాం. - శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డీఈఈ – న్యూస్‌టుడే, గుర్ల

దుమ్ము రేపుతోంది

నేటిచిత్రం



బొబ్బిలి నుంచి అలజంగి వెళ్లే రహదారిలో దుమ్ము రేగుతోంది. ఇటీవల ఈ మార్గంలో రాళ్లు వేసి మరమ్మతులు చేశారు. వాహనాల రాకపోకలకు తెల్లటి దుమ్ము పైకిలేస్తోంది. భారీ వాహనాల వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దగ్గుతో ఊపిరి ఆడడం లేదని, రోగాల బారిన పడుతున్నామని నిత్యం రాకపోకలు చేసే ఉద్యోగులు అంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనం కనిపించడం లేదని వాపోయారు. పూర్తిస్థాయిలో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే తారు వేస్తామని ఏఈ రాజు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

సొంతింటి కల.. నెరవేరనున్న వేళ

● ఎన్టీఆర్ గృహాల బిల్లులు నిలిపిన గత సర్కార్
● చెల్లింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు

పేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో నాటి తెదేపా ప్రభుత్వం 2016-17 నుంచి పెద్ద ఎత్తున ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు చొప్పున కేటాయించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ గృహాలకు బిల్లుల చెల్లింపులు నిలిపేసింది. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం లబ్ధిదారులందికీ బకాయిలు చెల్లించాలని నిర్ణయించింది. దీంతో చీపురుపల్లి నియోజకవర్గంలోని 3,394 మందికి లబ్ధి చేకూరనుంది. – న్యూస్‌టుడే, గరివిడి, చీపురుపల్లి, రాజాం


జియోట్యాగింగ్ కోసం ఇంటితోపాటు లబ్ధిదారుని ఫొటో తీస్తున్న గృహ నిర్మాణ శాఖ ఉద్యోగి

వివరాలు ఇలా..

మండలం	లబ్ధిదారులు
చీపురుపల్లి	792
గరివిడి	952
గుర్ల	819
మెరకముడిదాం	831
రాజాం	893
రేగిడి	1,933
సంతకవిటి	1,232
వంగర	1,373

స్థితిగతులపై నివేదిక

అయిదేళ్లుగా బిల్లులు నిలిచిపోవడంతో కొంతమంది అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మరికొందరు పూర్తి చేయలేక పనులు ఆపేశారు.. అద్దె గృహాల్లో ఉంటున్న దుస్థితి నెలకొంది. వీరి ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖకు ఆదేశాలిచ్చింది. నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నివేదించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం పునాదులు, గోడలు, రూఫ్, స్లాబ్ దశల్లో ఎన్ని ఉన్నాయి.. పూర్తి చేసినవి ఎన్ని అన్నది గుర్తించి జియోట్యాగింగ్ చేస్తున్నారు. పనులు ప్రారంభించి బిల్లులు చెల్లించకుండా ఉన్న ఇళ్లకు బిల్లు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ఇంటింటి పరిశీలన

ఎన్టీఆర్ గృహాలు నిర్మించిన పేదలకు గతంలో చెల్లించాల్సిన బిల్లు బకాయిలన్నీ చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నిధులు జమవుతాయి. ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నాం. పునాది స్థాయిలో నిలిపివేసిన ఇళ్లకు పునాది బిల్లు ఇవ్వడంతో పాటు వారికి కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశాలున్నాయి. – మురళి, డీఈ, గృహ నిర్మాణ శాఖ, చీపురుపల్లి

సంకిలి విద్యార్థిని ప్రతిభ


దిల్లీలో బాలిక హారిక ప్రదర్శన

రేగిడి, న్యూస్‌టుడే: దిల్లీలోని ప్రగతి మైదానంలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో సంకిలి జడ్పీ పాఠశాల విద్యార్థిని బి.హారిక న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రామినాయుడు తెలిపారు. విద్యార్థిని 'ఆధునిక హమర్' పరికరం రూపొందించినట్లు చెప్పారు.

తుప్పలు తొలగించారు

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం: గంట్యాడ పీహెచ్‌సీ ఆవరణలోని తుప్పలను తొలగించారు. ప్రతి రోజూ 100 నుంచి 150 మంది రోగులు వస్తున్న ఈ కేంద్రంలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, మరుగుదొడ్లు తుప్పల్లో ఉండటం తదితర సమస్యలపై ఈనెల 16న 'ఈనాడు'లో 'అసౌకర్యాల ఆసుపత్రి' శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు.

పునాదుల్లోనే గోదాం



గూడెం సొసైటీకి సంబంధించి రూ.40 లక్షల వ్యయంతో నిర్మాణం తలపెట్టిన గోదాం పనులు ఏడాది దాటుతున్నా.. ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఉన్నాయి. దీని నిర్మాణం పూర్తయితే సొసైటీకి సంబంధించిన ఎరువులు వంటివి నిల్వ చేసేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. సొసైటీ ఆదాయం కూడా పెరగడానికి అవకాశముంటుంది. ఈ విషయమై సొసైటీ సీఈవో వర్మ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

కల్వర్టు నిర్మించరూ..!

గడసాం గ్రామ సచివాలయం సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై కల్వర్టు నిర్మించాలని స్థానికులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు ఈ రహదారిపై నుంచి ప్రవహించడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గజపతినగరం నుంచి పోరలి వరకు ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అధికారులు విస్తరణ పనులు ప్రారంభించి గ్రామం వద్ద కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని జేఈ నరసింహారావు అన్నారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు



'వైద్యులు లేని సేవలు మాకొద్దు'



వంగర, న్యూస్‌టుడే: వైద్యులు లేని సేవలు మాకొద్దంటూ కొత్తవలస గ్రామస్థులు 104 వాహనం వద్ద నిరసన తెలిపారు. ఏఎన్ఎం, ఆశాకార్యకర్తతో ఉదయం 10.30 గంటలకు గ్రామానికి 104 వాహనం వచ్చింది. పీహెచ్‌సీ వైద్యులు లేకుండా సేవలు అందించడమేంటని జి.గోవిందరావు తదితరులు నిలదీశారు. ఈ విషయమై పీహెచ్‌సీ హెచ్‌వీ తవిటమ్మను చరవాణిలో సంప్రదించగా.. మర్యాద లేకుండా మాట్లాడారని గ్రామస్థులు చెబుతున్నారు. వైద్యాధికారి సీహెచ్.జ్యోతి 12 గంటల సమయంలో చేరుకోవడంతో ఆందోళన విరమించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థులు శారీరక దారుఢ్యం పెరిగి, మానసికంగా ఉల్లాసంగా ఉంటారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. మంగళవారం జడ్పీటీసీ సభ్యురాలు వి.శిరీష, సర్పంచి ఎం.సుధారాణితో కలిసి చీపురుపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. నాయకులు ఆర్.కామునాయుడు, డి.రామచంద్రుడు, ఎం.రమణ, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ


బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ జషువా జయప్రసాద్

గరివిడి, న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకం దినోత్సవ సందర్భంగా మంగళవారం గరివిడి పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పోస్టరు తయారీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగు కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వక్తృత్వంలో తెలుగు, ఆంగ్ల విభాగాల్లో ఎస్.గౌతమి, ఎస్.శైలజ ప్రథమ బహుమతులు సాధించారు. అశ్విని ద్వితీయ, కె.సత్యవతి తృతీయ బహుమతులు గెలుపొందారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ వి.జాషువా జయప్రసాద్, సిబ్బంది అభినందించారు.

కౌలు రైతుల వినతి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలం, నాయకులు తహసీల్దారు శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ● గజపతినగరం: రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు.

విచారణ చేయాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని సీబీఎం బాలికల పాఠశాల అన్యాక్రాంతంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దారు శ్రీనుకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కె.సునీల్ కుమార్ వినతిపత్రం అందజేశారు.

మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

గుర్ల, న్యూస్‌టుడే: గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధ, గురువారాలు మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక చేపడతామని ఎంఈవోలు భానుప్రకాష్, శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి ఉన్న బాల బాలికలు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

పవన్ దీక్షకు మద్దతుగా పూజలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ విషయంలో జరిగిన దోషానికి పరిహారంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా మేము సైతం అంటూ బొబ్బిలి జనసేన పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

గజపతినగరం, బొండపల్లి, న్యూస్‌టుడే: బోడసింగిపేట సమీప పట్టాల వద్ద గుర్తుతెలియని దాదాపు 30 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు విజయనగరం రైల్వే ఎస్ఐ వి.బాలాజీరావు తెలిపారు. రైలు ఢీకొని, లేదా బండి నుంచి జారిపడి మృతిచెందినట్లు తెలుస్తోందని చెప్పారు. మృతుడు నలుపు రంగు ప్యాంటు, గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 9490617089లో సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎరువుతో ఆదాయం


వ్యర్థాలు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

రాజాం: పంచాయతీలకు ఆదాయం సమకూర్చే ఎరువు తయారీపై ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సిబ్బందిని ప్రశ్నించారు. వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. గడిముడిదాంలో సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

రైతులకు అండగా ప్రభుత్వం


కషాయం తయారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

న్యూస్‌టుడే బృందం

తెదేపా ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. బాడంగి మండలం రేజేరు గ్రామంలో మంగళవారం వ్యవసాయాధికారుల సమక్షంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసేలా అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. రైతులు తయారు చేసిన కషాయాల గురించి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, ఏడీఏ శ్యామ్ సుందర్, తెంటు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

● రాజాం మండలం పొగిరిలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కె.చంద్రరావు డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. తెదేపా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు జి.నారాయణరావు, ఏవో రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు. చీపురుపల్లి మండలం నిమ్మలవలసలో జరిగిన కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పాల్గొన్నారు. గరివిడి మండలం గెడ్డపువలస, తాటిగూడ గ్రామాల్లో ఏవో శైలజ, సంతకవిటి మండలం మామిడిపల్లిలో ఏవో పి.నవీన్, గుర్ల మండలం వల్లాపురం, తాటిపూడి గ్రామాల్లో ఏవో తిరుపతిరావు ఆధ్వర్యంలో రైతులకు సూచనలు చేశారు. వెంకంపేట, కందిశ గ్రామాల్లో డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ తదితర అంశాలను ఏవో మురళీకృష్ణ తెలిపారు. ● వంగర మండలం వి.వి.ఆర్.పేటలో ఏవో కన్నబాబు, రామభద్రపురం మండలం నాయుడువలసలో ఏవో వెంకటయ్య, తెర్లాం మండలం ఆమిటిలో ఏవో జి.సునీల్, గంట్యాడ మండలం రామవరం, నరవ గ్రామాల్లో ఏవో శ్యామ్‌కుమార్, గజపతినగరం మండలం కాళంరాజు పేటలో భాజపా జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుర్గా ప్రసాద్, అధికారుల ఆధ్వర్యంలో 'పొలంబడి' జరిగింది. దత్తిరాజేరు రైతు సేవా కేంద్రంలో ఏడీఏ మహారాజన్, ఏవో గోవిందమ్మ, బొబ్బిలి మండలం కృష్ణాపురం, జగన్నాథపురంలో ఏడీఏ శ్యామ్‌సుందర్ రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.


పొగిరి: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో అధికారులు

విద్యుత్తు సమస్యలపై సభ్యుల ధ్వజం


మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలంలోని విద్యుత్తు సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజాప్రతినిధులు చెప్పినా పట్టించుకోరా? అంటూ.. పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. ఉప ఎంపీపీ అరసాడ శంకరరావు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్తుశాఖపై జేఈ ఎల్లంనాయుడు మాట్లాడుతుండగా.. కోమటిపల్లి ఎంపీటీసీ ప్రతినిధి సత్యంనాయుడు మాట్లాడుతూ ఇళ్ల మీద నుంచి తీగలు వేశారని వాటి వల్ల ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. చర్యలు చేపడతామని జేఈ హామీ ఇచ్చారు. రీసర్వే కారణంగా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని కారాడ, కొండదేవుపల్లి గ్రామాల ప్రతినిధులు సంజీవినాయుడు, వెంకటరమణ తహసీల్దారు శ్రీను దృష్టికి తెచ్చారు. ఎంపీడీవో రవికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ● సమావేశానికి చాలా గ్రామాల నుంచి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు రాకుండా వారి భర్తలు, మామలు, బంధువులు హాజరై, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పెంట వద్ద వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఎం.బూర్జివలస వద్ద పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాలతో ఎస్ఐ రమేష్ సిబ్బందితో వెళ్లి మంగళవారం రెండు ట్రాక్టర్లను పట్టుకుని, సీజ్ చేశారు.

చెట్టును ఢీకొన్న లారీ

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: దత్తి రహదారి కూడలి వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో కొన్ని సిలిండర్లు కింద పడ్డాయి. అవి ఖాళీవి కావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ హాని జరగలేదు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజాం, బొబ్బిలి గ్రామీణం: రాజాం పట్టణంలోని పాత ఆర్టీసీ బస్టాండు వద్ద అక్రమంగా 30 మద్యం సీసాలను తరలిస్తున్న వి.గౌరునాయుడును మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. బొబ్బిలి పట్టణ పరిధి ఆకులరెల్లి వీధి శివారులో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఎ.శంకరరావును అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


గరుగుబిల్లిలో 'పొలంబడి' కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

మెరకముడిదాం న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మెరకముడిదాం మండలం గరుగుబిల్లిలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో అందజేసిన సంక్షేమ పథకాలు, మెగా డీఎస్సీ తదితర విషయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కె.త్రిమూర్తులరాజు, టి.సన్యాసినాయుడు, కె.ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

మంచి పాలనే కూటమి ధ్యేయం


సంతకవిటి: రామరాయపురంలో కరపత్రాలు అందిస్తున్న జనసేన నాయకులు

న్యూస్‌టుడే బృందం

ప్రజలకు మంచి పాలన అందించి గ్రామాలను మరింత అభివృద్ధి పరచడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కుసుమూరులో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుతో కలిసి పర్యటించారు. అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, తహసీల్దారు హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజాం నియోజకవర్గ జనసేన నాయకుడు యుపీ రాజు అన్నారు. సంతకవిటి మండలం రామరాయపురంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. వంగర మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు బొత్స వాసుదేవరావు నాయుడు ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను ప్రజలు వివరించారు. చీపురుపల్లి మండలం నిమ్మలవలసలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ● గరివిడి మండలం కాపుశంభాంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పి.బలరాం, రామభద్రపురంలో తెదేపా రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలో వంతరాం రహదారి, సాయినగర్ సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి తెదేపా పార్టీ పట్టణ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జులు, గంట్యాడ మండలం నరవ గ్రామంలో మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు, గజపతినగరం మండలంలోని డోలపేట, దావాలపేటలో భాజపా జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన పథకాల గురించి వివరించారు.


డోలపేటలో నిర్వహించిన కార్యక్రమంలో భాజపా అధ్యక్షురాలు పావని, నాయకులు

సమాజసేవలో భాగస్వాములు కావాలి


విద్యార్థుల ప్రతిజ్ఞ

గరివిడి, చీపురుపల్లి, బాడంగి: యువత సమాజం పట్ల బాధ్యత, సేవా గుణం పెంపొందించుకునేందుకు జాతీయ సేవా పథకం దోహదపడుతుందని గరివిడి ఎస్సై లోకేశ్వరరావు అన్నారు. స్థానిక పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్ ఎం.శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో ఎస్సై అతిథిగా పాల్గొన్నారు. ఇంజినీరింగు నిపుణుడు ఆర్వీకే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● విద్యార్థులు సామాజిక సేవా భావాలను అలవరుచుకోవాలని చీపురుపల్లి శ్రీనివాస్ జూనియర్ కళాశాల ప్రధానాచార్యుడు ఏడీఎన్ఎస్వీ ప్రసాద్ అన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు సుబ్రహ్మణ్యం, వెంకటరమణ ఉన్నారు. ● బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ విజయకుమారి, పీవో సూర్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

విద్యార్థి దశ కీలకం: ఎస్పీ


వేదికపై ఎస్పీ వకుల్ జిందాల్, రోటరీ ప్రతినిధులు

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే బాలలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. మంగళవారం విజయనగరంలో రోటరీ క్లబ్, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ డా.మళ్ల, శ్రీనివాస సోనూ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా గళమెత్తేనా..!?

నేడు నగరపాలిక సాధారణ సమావేశం



విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: దాదాపు మూడు నెలల తరువాత విజయనగరం నగరపాలక సంస్థ పాలకవర్గ సాధారణ సమావేశం జరగనుంది. బుధవారం ఉదయం 11 గంటలకు మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికారులు 20 అంశాలతో అజెండాను రూపొందించారు. టేబుల్ అజెండాగా మరికొన్నింటిని తీసుకొచ్చే అవకాశం ఉంది. మంగళవారం సాయంత్రం వైకాపా కార్పొరేటర్లు మాజీ డిప్యూటీ స్పీకరు నివాసంలో నిర్వహించిన ప్రీకౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. కేవలం 13 మంది మాత్రమే హాజరైనట్లు తెలుస్తోంది. వారిలో స్థాయీ సంఘానికి ఎన్నికైన నలుగురిలో ఇద్దరే ఉండడం గమనార్హం. దీంతో పార్టీ మారతారనే ప్రచారం ఊపందుకుంది.

ఈ సమస్యలను ప్రస్తావించాల్సిందే..

నగరంలో సమస్యలు తాండవిస్తున్నాయి. పారిశుద్ధ్యం నిర్వహణ గాడితప్పింది. చెత్త తరలింపు వాహనాలు, పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. కొత్త కుళాయిల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. నీటి సరఫరా వేళలు తప్పడం, రంగుమారిన నీటి సరఫరా, కుళాయిలు పనిచేయకపోవడం తదితర ఇబ్బందులున్నాయి. పైడితల్లమ్మ పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తిచేయాల్సి ఉంది. ఇంతవరకు ప్రారంభం కాలేదు. వీటన్నింటిపై సభ్యులు చర్చించాల్సిఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి చర్చలు లేకుండానే ముగించేవారు. కూటమి అధికారంలోకి రావడంతో పరిస్థితి మారుతుందని నగరవాసులు భావిస్తున్నారు.

ఆగ్రాలో ఆకట్టుకున్నారు!!

రెండు నెలల కిందట అనంతపురంలో జరిగిన తైక్వాండో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో నగర క్రీడాకారులు సత్తా చాటారు. అక్కడితో ఆగకుండా అందులో సాధించిన ప్రతిభ ఆధారంగా ఈ నెలలో ఆగ్రాలో జరిగిన జాతీయ స్థాయి టోర్నీలో పతకాలు సొంతం చేసుకున్నారు నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు. ఓ వైపు చదువుతూనే.. మరోవైపు ఇష్టమైన ఆట కోసం స్థానికంగా సాధన చేస్తూ రాణిస్తున్నారు.
– న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

తైక్వాండోలో పతకాల పంట



అయిదో తరగతి చదువుతున్న **పి.పునీత్** రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఆరు సార్లు పాల్గొన్నాడు. 2023లో తెనాలిలో జరిగిన టోర్నీలో వివిధ విభాగాల్లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకొని అదే ఏడాది డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ మీట్‌లో ఒక రజతం గెల్చుకున్నాడు. ఈ ఏడాది 2024లో అనంతపురం జరిగిన టోర్నీలో మూడు స్వర్ణాలు తెచ్చుకున్నాడు. తాజాగా రజతం, కాంస్యం గెల్చుకున్నాడు. తల్లిదండ్రులు గోపి, సూర్యకుమారి.



నగరానికి చెందిన **వి.కుషాల్** ఏడో తరగతి చదువుతున్నాడు. మూడో తరగతి నుంచి తైక్వాండో సాధన చేస్తున్నాడు. రాష్ట్రస్థాయిలో నాలుగుసార్లు, జాతీయస్థాయిలో రెండు సార్లు ఆడాడు. 2022లో విశాఖపట్నంలో, నెల్లూరులో జరిగిన టోర్నీల్లో ప్రతిభ చూపాడు. గతేడాది తెనాలిలో జరిగిన మీట్‌లో స్వర్ణం, రజతం గెల్చుకొని డెహ్రాడూన్ టోర్నీకి అర్హత సాధించి.. రజతం, కాంస్యం దక్కించుకున్నాడు. ఈ ఏడాది అనంతపురంలో జరిగిన మీట్‌లో రెండు స్వర్ణాలతో ఆగ్రా పోటీలకు అర్హత సాధించాడు. అక్కడ రజతం, కాంస్యం కొట్టి.. ఔరా అనిపించాడు. తండ్రి గోపి పోలీసు శాఖలో పనిచేస్తున్నారు. తల్లి సూర్యకుమారి గృహిణి.



కామాక్షినగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న నీటిపారుదలశాఖ అధికారి కె.గంగాధర్, గాయత్రి దంపతుల కుమార్తె **సాహిత్య** ప్రస్తుతం 7వ తరగతి చదువుతోంది. 2022 నుంచి వరుసగా అనంతపురం, విశాఖపట్నం, తెనాలి, నెల్లూరు జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు పొందింది. 2022లో ఝార్ఖండ్ జరిగిన ఓపెన్ మీట్‌లో ఒక రజతం, 2023లో డెహ్రాడూన్‌లో కాంస్యం, ఇటీవల ఆగ్రాలో జరిగిన నేషనల్ మీట్‌లో స్వర్ణం, కాంస్యంతో మెరిసింది.



దుప్పాడకు చెందిన ఎస్.నాగరాజు, కళావతి దంపతుల కుమారుడు **ఎస్.సాత్విక్** ఏడో తరగతి చదువుతున్నాడు. ఇప్పటివరకు నాలుగుసార్లు రాష్ట్రస్థాయిలో మెరిశాడు. 2022 నెల్లూరులో జరిగిన ఓపెన్ మీట్‌లో కాంస్యం గెల్చుకొని మరుసటి ఏడాది ఝార్ఖండ్‌లో జరిగిన నేషనల్ టోర్నీలో పాల్గొని రజతం సొంతం చేసుకున్నాడు. 2022లో విశాఖపట్నంలో రజతం, కాంస్యం, 2023 తెనాలిలో స్వర్ణం, రజతం గెల్చుకొని డెహ్రాడూన్ మీట్‌కు ఎంపికై అక్కడ కూడా రజతం సాధించాడు. ఈ ఏడాది అనంతపురం జిల్లాలో జరిగిన టోర్నమెంటులో మూడు స్వర్ణాలు, ఆగ్రాలో రజతం కైవసం చేసుకున్నాడు.

గ్రామాల్లో అప్రమత్తత అవసరం

నెల్లిమర్ల: గ్రామాల్లో ఎలాంటి తగాదాలు జరగకుండా గ్రామ, వార్డు సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రామకృష్ణ సూచించారు. మంగళవారం నెల్లిమర్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు జరిగితే సమాచారం అందించాలని, జూద శిబిరాలపై నిఘా ఉంచాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

? స్టేడియంపేట, కల్యాణి నగర్ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - **స్థానికులు**

● సిబ్బందిని పంపించి, బాగు చేయిస్తాం. - **ఎస్.అప్పారావు, డీఈఈ, నగర పాలక సంస్థ**

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

దీపాలు వెలిగాయ్ (స్పందనకు వందనం)

విజయనగరం పట్టణం: బేరిచావిడి వీధి, శివాలయం ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. డీఈఈ ఎస్.అప్పారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారులు

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల పరంగా ఎంఎల్‌హెచ్‌పీలు కీలకమని, వారు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త సుబ్రహ్మణ్యం అన్నారు. నేచర్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని యువజన వసతి గృహంలో ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన నిర్వహించారు. ఆరోగ్య అంశాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు శిబిరాన్ని సందర్శించారు. వైద్యురాలు ఎం.అనూష, యూనిసెఫ్ సీనియర్ కన్సల్టెంట్ శ్రీలత, నేచర్ సంస్థ డైరెక్టర్ ఎస్.వికాష్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులు బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిణి వై.నాగమణి అన్నారు. మండలంలో పేరాపురం పంచాయతీని సందర్శించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజూ జ్వర సర్వే, శుక్ర, మంగళవారాల్లో గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైద్యాధికారి రాజేష్‌వర్మ, సిబ్బంది ఆర్.వి.రమణ పాల్గొన్నారు.


పరిసరాలు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి నాగమణి

విద్యార్థులూ.. ఈ దారిలో జాగ్రత్త

భోగాపురం మండలంలోని రామచంద్రపేట ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి బురదమయంగా మారింది. చిన్న వర్షానికి ఇక్కడి మట్టిరోడ్డుపై గుంతలో నీరు చేరడంతో విద్యార్థులు రాకపోకలకు నిత్యం అవస్థలు పడుతున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులైనా గుంతలో మట్టివేస్తే విద్యార్థులకు ఇబ్బందులు కొంతవరకైనా తప్పుతాయి. ఈ విషయమై ఎంఈవో రమణమూర్తి వద్ద ప్రస్తావించగా యాజమాన్య కమిటీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, భోగాపురం



మురుగు పారేదెలా?



పెదతాడివాడ కూడలిలో యూనియన్ బ్యాంకు వద్ద సీసీ కాలువల్లేక పోవడంతో మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. దాంతో పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఆర్అండ్‌బీ రహదారి పక్కన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు పారడంలేక ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వహీదా రెహ్మానీను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిశీలించి మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, డెంకాడ

బాలికలకు అస్వస్థత


వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని పందిరప్పన్న కూడలి సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతిగృహంలో విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు. వసతిగృహంలోని మొత్తం 86 మంది విద్యార్థినులుండగా ఆరుగురికి ఉదయం నుంచి వాంతులు, విరేచనాలు అధికమయ్యాయి. సమాచారం అందుకున్న కొట్టాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పరిశీలించి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు.. వారిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ నీల పద్మావతితో వైద్యం అందిస్తున్నారు. డీఎంహెచ్‌వోతో జిల్లా మలేరియా అధికారి వై.నాగమణి ఉన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళితులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న దళితులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.సాంబయ్య, వై.గోపాలరావు డిమాండు చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద అంబేడ్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో దళితులు ధర్నా చేపట్టారు. దళిత పల్లెల్లో తాగునీటి సదుపాయం లేదని, మురుగు కాలువలు కూడా నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బసవ సూర్యనారాయణ, రవి సిద్ధార్థ, సత్తి వెంకట్రావు, ఆనంద్, లోకేష్, తౌడు తదితరులు పాల్గొన్నారు.

'ఉన్న ఇల్లు నిర్మిస్తాం.. పేదలకు పెద్దోళ్లను చేస్తామ'ని గత పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ వాస్తవానికి అంతా విరుద్ధంగా చేశారు. అనర్హులకు పట్టాలు కట్టబెట్టడం లాంటివి ఎన్నో చేశారు. గత ప్రభుత్వ పెద్దలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఎంపిక చేసిన లబ్ధిదారుల అర్హతను పునఃపరిశీలన చేసి.. అనర్హుల్ని చర్యలు తీసుకోవాలని స్వయంగా రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి సిసోదియా గత నెల కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లతో జరిగిన సమావేశంలో ఆదేశించారు. నేటికీ ఈ విషయంలో అధికారులో స్పందన లేదు. – న్యూస్‌టుడే, శృంగవరపుకోట

జగనన్న కాలనీ
అక్రమాలపై చర్యలేవీ?

ఇదీ పరిస్థితి..


ఎస్.కోట జగనన్న కాలనీ

జిల్లాలో విజయనగరం తరువాత అతిపెద్ద లేఅవుట్ శృంగవరపుకోట పట్టణంలో పుణ్యగిరి రోడ్డులో వేశారు. ఇందులో 1,043 మందికి స్థలాలు కేటాయించారు. ఈ కాలనీలో ఇళ్ల స్థలాల కేటాయింపుపై 'ఈనాడు'లో కథనాలు వెలువడడంతో అప్పట్లో ఆర్డీవో విచారణకు ఆదేశించారు. ఈ ఏడాది జనవరిలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, వీఆర్వోలు చేసిన విచారణలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. అప్పటికే సుమారు 23 స్థలాలు అమ్మకాలు జరిగాయని గుర్తించారు. ప్రజావసరాల నిమిత్తం కేటాయించిన స్థలాల్లో రెండు ఏకంగా డూప్లెక్సు ఇళ్ల నిర్మాణం చేశారని, నలుగురు లబ్ధిదారులు పక్కనున్న ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టారని నిర్ధారించారు. నేటికీ ఈ నివేదికపై చర్యలు లేవు. ✦ శృంగవరపుకోట పట్టణంలోని జగనన్న కాలనీలో సీపీఎం పార్టీ నిర్వహించిన సర్వేలో 250 మందికి పైగా స్థలాలు విక్రయించారని గుర్తించారు. పట్టణంలో ఇళ్లు ఉన్నవారికీ, ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికీ స్థలాలు మంజూరయ్యాయని పలువురు వాపోతున్నారు. ఎస్.కోట పట్టణంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు లేని వారికి సైతం ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు చెబుతున్నారు. మొదట్లో కాలనీలో సెంటున్నర స్థలం రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షలు, ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇచ్చాక.. ఏకంగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు పెరిగిందని చర్చించుకుంటున్నారు.

సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం: ఎన్నికల ముందు రెవెన్యూ సిబ్బంది జగనన్న కాలనీలో పరిశీలించి నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. ఇటీవలే బదిలీపై ఇక్కడకు వచ్చాను. దీనిపై మరోసారి పరిశీలన చేయించి.. అనర్హులుంటే చర్యలు తీసుకుంటాం. **- అరుణకుమారి, తహసీల్దారు, శృంగవరపుకోట**

ఆధునిక పద్ధతులతో మేలు


వరిపొలంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

విజయనగరం గ్రామీణం, లక్కవరపుకోట, జామి, భోగాపురం, వేపాడ, డెంకాడ, కొత్తవలస, న్యూస్‌టుడే: విజయనగరం మండలంలోని దుప్పాడ, రాకోడు పంచాయతీల్లో మంగళవారం వ్యవసాయాధికారి హర్షలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రైతుశిక్షణా కేంద్రం ఏడీఏ భారతి ఆధునిక పద్ధతులను అన్నదాతలకు వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ★ వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో రైతులు చైతన్యం కావాలని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ సహాయ సంచాలకురాలు అన్నపూర్ణ అన్నారు. ఖాసాపేట, తలారి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ★ వేపాడ మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గోడప్రతులను విడుదల చేశారు. ★ రైతులు వారికున్న పొలంలో కొంత విస్తీర్ణంలోనైనా సేంద్రియ వ్యవసాయం చేయాలని వ్యవసాయాధికారిణి కె.మాధురి శరణ్య సూచించారు. వరిలో అగ్గి, పొడ తెగులు నివారణకు చీడివలసలో రైతులకు ఉచితంగా సుడోమోనస్ సంచులను పంపిణీ చేశారు.


బొద్దాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలిత కుమారి

అభివృద్ధి పథంలో రాష్ట్రం

వేపాడ, శృంగవరపుకోట, లక్కవరపుకోట, భోగాపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని బొద్దాంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ◆ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని శృంగవరపుకోటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నారు. ◆ వంద రోజుల పాలనలో మంచి ప్రభుత్వంగా పేరు పొందిందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.ఈశ్వరరావు, రంగారాయపురం సర్పంచి కె.రామలక్ష్మి అన్నారు. ◆ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు.

సంక్షిప్త సమాచారం



ఇనుప బారికేడ్ల అందజేత

కంటోన్మెంట్: పైడితల్లి పండగ సందర్భంగా నగరానికి చెందిన గోవిందా జ్యూయలర్స్ ప్రతినిధులు రూ.1,78,000 విలువైన ఇనుప బారికేడ్లను దేవస్థానం ఏసీ ప్రసాదరావుకు అందజేశారు.

జూద శిబిరంపై దాడి

నెల్లిమర్ల: సారిపల్లి టిడ్కో గృహ సముదాయాల వద్ద జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురు నిందితుల నుంచి రూ.25,060 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ తెలిపారు.

బీసీల సంక్షేమానికి కృషి

మయూరి కూడలి: బీసీల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. విజయనగరంలోని సంఘ భవనంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. సంఘ భవనానికి కావాల్సిన స్థలం, నిధులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని, ఈ విషయాన్ని ఇప్పటికే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నియామకం..



శృంగవరపుకోట: రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంటు కార్పొరేషన్ సభ్యురాలిగా బొడ్డవరకు చెందిన ఇందుకూరి సుబ్బలక్ష్మి(సుధారాజు)నియమితులయ్యారు.

క్రీడలతోనే ఆరోగ్యం

నెల్లిమర్ల, శృంగవరపుకోట: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బి.సరోజని, కె.ఆనంద్‌కుమార్ అన్నారు. థామస్‌పేట ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమన్వయకర్త ప్రమీల పాత్రో ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు.

శివశంకర్‌కు అభినందనలు

శృంగవరపుకోట: రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఛైర్మన్‌గా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ నియమితులయ్యారు. మంగళవారం విశాఖలో నియోజకవర్గ సీనియర్ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడుతో పాటు జనసేననాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

వైద్య విభాగం: విద్యార్థుల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా ఆరు నెలలకు ఒకసారి వేసుకోవాలని ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ జాతీయ అధికారిణి జస్వీందర్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం పలు విద్యాసంస్థల్లో అవగాహన కల్పించారు.

రైల్వే పోలీస్ స్టేషన్ సందర్శన

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విశాఖపట్నం రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ మంగళవారం విజయనగరంలోని రైల్వే పోలీసు స్టేషన్‌ను సందర్శించారు.

10 రోజుల్లో వసతి సమస్యకు పరిష్కారం


ఎమ్మెల్సీకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. అక్కడ నెలకొన్న పలు సమస్యలను తెలుసుకున్నారు. 400 మంది విద్యార్థులున్నా.. వసతి సౌకర్యం లేదని పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ భవనం లేకపోయినా కనీసం ప్రైవేటు భవనాన్నైనా తాత్కాలికంగా కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పది రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. ఇన్‌ఛార్జి ప్రధానాచారిణి బి.సుభ, అధ్యాపకులు పి.జయలక్ష్మి, జయపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించండి


సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ లాల్వాణికి వినతిపత్రం అందజేస్తున్న ఒప్పంద ఉద్యోగులు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఒప్పంద, పొరుగు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ లాల్వాణికి పలువురు ఉద్యోగులు మంగళవారం నెల్లిమర్లలో వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు లేకపోవడం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర జీతాలతో అవస్థలు పడుతున్నామని వాపోయారు.

గో సంరక్షణకు మహిళలు ముందుకు రావాలి


నూతన కమిటీ సభ్యులు

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: గోసంరక్షణ, జంతు సంక్షేమం కోసం వాటి హక్కులను కాపాడటానికి మహిళలు ముందుకు రావాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం సమాఖ్య కార్యాలయంలో విజయనగరం పట్టణ మహిళా కమిటీ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షురాలిగా గాజులరేగకు చెందిన చెన్నా తులసి, ఉపాధ్యక్షురాలిగా సోము నందిని, ప్రధాన కార్యదర్శిగా కోరాడ మాధురి యాదవ్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరిగే గోవధకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. పట్టణ అధ్యక్షుడు సోంబాబు మాట్లాడుతూ నగరంలో విచ్చలవిడిగా పశు మాంస విక్రయ కేంద్రాలు పెరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు.

బంగార్రాజుకు అభినందనల వెల్లువ


సత్కరిస్తున్న వనజాక్షి, రవిశేఖర్

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, రవిశేఖర్ దంపతులు ఆయనను పూలమాలతో సత్కరించారు. కడగల ఆనంద్‌కుమార్, లెంక అప్పలనాయుడు, కోటపాటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరంలో నవంబరు 27 నుంచి 30 వరకు జరగనున్న 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. అమర్‌భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యలనగరిలో నిర్వహించడం మంచి పరిణామమన్నారు. జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, నగర నాయకులు రాము, భార్గవ్, కిరణ్, భరత్,శంకర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ


సరకులు అందిస్తున్న రామమోహన్

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: నగరంలోని కణపాక మారుతీ సేవా సంఘం పేదలకు అండగా నిలిచింది. సంఘం అధ్యక్షుడు గుత్తూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాత చలుమూరి రామమోహన్, జానకి దంపతులు కె.ఎల్.పురం, అయ్యన్నపేట, రామవరం, పెదవేమలి, మురపాక ప్రాంతాలకు చెందిన 80 మందికి రూ.80 వేల విలువ చేసే బియ్యం, పప్పులు, నూనె, గోధుమపిండి, పంచదార తదితర సరకులు అందజేశారు. సంఘం సభ్యులు తులసీరాం, వెంకటరావు, నాగరాజు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం


ఏసీ ప్రసాదరావుకు చెక్కు అందజేస్తున్న దాత

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: విజయనగరానికి చెందిన శ్రీనివాస నర్సరీ గార్డెన్స్ అధినేత ఉప్పలపాటి శ్రీనివాసవర్మ, ఉషా దంపతులు పైడితల్లి అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని దేవస్థానం సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావుకు మంగళవారం స్థానిక చదురుగుడి ప్రాంగణంలో చెక్కు రూపంలో ఇచ్చారు.